క్లుప్తంగా

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి పండుగ అని, ప్రజలందరూ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. భగవంతుని ఆశీస్సులు అందరిమీద ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సోమవారం జరగనుంది. సోమవారం ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక వాహనంపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయ అధికారులు గిరి ప్రదక్షిణకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించనున్నారు. ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు మీదగా బ్రాహ్మణ వీధి, అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. గిరి ప్రదక్షిణలో ఆలయ అధికారులు, సేవా సిబ్బందితో పాటు భక్తులు పాల్గొనాలని దేవస్థాన వైదిక కమిటి పేర్కొంది.

వేమూరి కథలు వాస్తవ జీవిత దర్పణాలు



విజయవాడకల్చరల్: వేమూరి సత్యనారాయణ కథలు వాస్తవ జీవిత దర్పణాలని కవి బండ్ల మాధవరావు అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖర పాఠశాలలో కథకుడు, సినీ చిత్ర నిర్మాత రచించిన ఎనభైలో ఇరవై కథా సంపుటి పరిచయ సభను ఆదివారం నిర్వహించారు. మాధవరావు మాట్లాడుతూ.. సమాజ చిత్రీకరణ చేయడంలో కథకుడు సత్యనారాయణ అందవేసిన చెయ్యి అని అభివర్ణించారు. సాహితీవేత్త నందూరి రాజగోపాల్ మాట్లాడుతూ.. సత్యం కథలో కథ, ముగింపు ప్రత్యేకత కలిగి ఉంటుందన్నారు. గ్రంథ రచయిత వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. నా చుట్టూ ఉన్న జీవితాలే కథకు వస్తువులన్నారు. అవి వాస్తవ వ్యక్తులేకానీ కల్పిత పాత్రలు కావన్నారు. సాహితీవేత్త తుమ్మల గోపాలరావు సత్యం సాహిత్య విశేషాలను వివరించారు. సాహితీ మిత్రులు నిర్వాహకుడు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, అనిల్ డ్యానీ, తోటకూర రఘు, అంజని యలమంచలి, పుష్పాల శ్రీరామ్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి: నరహరిశెట్టి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ అంబేడ్కర్‌పై, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, రాజ్యాంగ మౌలిక కరపత్రికను బోడెమ్మ హోటల్ వద్ద ప్రజలకు పంచారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను బీజేపీ అవమానించిన తీరును ప్రజలు గమనించారన్నారు. కేంద్రానికి అధికారంలో ఉండే అర్హత లేదన్నారు. పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ అన్సారి, పార్టీ లీగల్ సెల్ కార్యదర్శి కండెల వరప్రసాద్ తదితరులు పాల్గొనాలి.

బరిలోకి 'కూటమి' పుంజులు సిద్ధం

- కోడి పందేలకు సిద్ధమవుతున్న నేతలు
- పండుగ మూడు రోజులకు ప్రభుత్వ పెద్దలు సరే అన్నట్లు సమాచారం!
- నిబంధనలు బేఖాతరు
- పోలీసులు హడావుడి చేసినా.. ఆగని కూటమి నేతలు



జక్కంపూడిలో సిద్ధం చేసిన కోడి పందేల బరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని వెస్ట్ జోన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో కూటమి నేతలు బరులను ఏర్పాటుచేసి పోటీలకు సమాయత్తం అవుతున్నారు. కోడి పందేలతో కోట్లాది రూపాయలు చేతులు మారి కుటుంబాలు రోడ్డున పడుతున్న నేపథ్యంలో వాటిపై ఉన్నత న్యాయస్థానాలు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. కోడి పందేలు నిర్వహించకూడదని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని చట్టాలు చెబుతున్నా వాటిని ఎక్కడా అమలు చేసే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. వెస్ట్‌జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి బరులను ఏర్పాటు చేసి పోటీలకు సమాయత్తమవుతున్నారు. పోలీసు అధికారులు పందెం బరుల ఏర్పాట్లను అరకొర అడ్డుకొని వాటిని నివారించే ప్రయత్నాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించకూడదంటూ ముందస్తు ప్రకటనలు చేశారు. అవన్నీ తూతూమంత్రంగానే ఉన్నాయి.

కూటమి నేతలు అత్యుత్సాహంగా

వెస్ట్‌జోన్ పరిధిలోని ఆయా పీఎస్‌ల పరిధుల్లో ఏర్పాట్లు అడ్డుకున్న పోలీసులపై కూటమి నేతలు ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు చేశారు. వారం రోజులుగా ఆయా ప్రాంతాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. ప్రభుత్వ పెద్దలు పండుగ మూడు రోజులు చూద్దాంలే దానిపై హడావుడి చేయకండంటూ వారం రోజులుగా కూటమి నేతలకు సర్ది చెబుతూ వస్తున్నారు. దాంతో కూటమి నేతలు పోలీసులపై అద్దం తిరుగుతున్నారు. 'మీ పని మీరు చేయండి... మా పని మేం చేసుకుంటాం...' అంటూ కూటమి నేతలు పోలీసులను హెచ్చరించడం కనిపించింది. దాంతో ఆదివారం వరకూ బరులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో బ్యానర్లు పెట్టి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



కోడి పందేలు ఆడకూడదంటూ పోలీసు శాఖ బ్యానరులు

నేతలు సమాయత్తం

వెస్ట్‌జోన్ పరిధిలోని కొత్తపేట, ఇబ్రహీంపట్నం, భవానీపురం పీఎస్ పరిధుల్లో కోడి పందేలకు స్థానిక కూటమి నేతలు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కొత్తపేట పీఎస్ పరిధిలోని అంబాపురం, పీ నైనవరం, జక్కంపూడి, పాముల కాలువ పరిసర ప్రాంతాల్లోని తోటల్లో ఏర్పాట్లు షురూ చేశారు. భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని బొబ్బురి గ్రౌండ్స్‌లోనే బరిని ఏర్పాటు చేయటానికి నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గొల్లపూడి పరిసర ప్రాంతాల్లోనూ కూటమి నేతలు ఒకరిద్దరూ కోడి పందెళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

> **కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు**
>
> వెస్ట్‌జోన్ పరిధిలో ఎక్కడ కోడి పందేలు నిర్వహించినా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకూ ఆయా ప్రాంతాల్లో స్థానికులు కోడి పందేలకు చేస్తున్న ఏర్పాట్లను అడ్డుకొని హెచ్చరికలు జారీ చేశాం. గతంలో ఆయా సంఘటనలు జరిగిన ప్రదేశాల్లో హెచ్చరికల బ్యానర్లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం.
>
> –దుర్గారావు, వెస్ట్‌జోన్ ఏసీపీ

ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటుగా పరిసర గ్రామ శివారుల్లో, తోటల్లో బరులను ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

ముందుగానే ఒప్పందాలు

కూటమి నేతలు కొంతమంది పోలీసు అధికారులతో, రెవెన్యూ అధికారులతో ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ పెద్దలు అనధికారికంగా అనుమతులు ఇస్తారని, మా జోలికి రావద్దంటూ కూటమి నేతలు స్థానిక అధికారుల్లోని కొంతమందిని ఇప్పటికే తమకు అనుకూలంగా మార్చుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సంక్రాంతి రద్దీ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి రద్దీ ఆదివారం నుంచే మొదలైంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు చెన్నై, బెంగుళూరు వంటి మహానగరాల నుంచి సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు బయలుదేరిన వారు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయంలోని క్యూలు కిటకిటలాడుతున్నాయి. ఉదయం 8 గంటలకు అన్ని క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. మహామండపం లిఫ్టు, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూల ద్వారా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన సమర్పించడానికి అర్థగంట అన్ని దర్శనాలు నిలిపివేయడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎక్కడా కూడా వేచి ఉండకుండా, తోపులాటకు ఆస్కారం లేకుండా క్యూలైన్లలో ముందుకు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఈవో రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఏషియన్ యోగా పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న సత్యప్రసాద్‌రాజు



ప్రశంసా పత్రం అందుకుంటున్న పూజిత

విజయవాడస్పోర్ట్స్: ఏషియన్ యోగా చాంపియన్ షిప్‌లో విజయవాడ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబర్చి పతకాలను కైవసం చేసుకున్నారు. సింగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన ఈ పోటీలకు నగరానికి చెందిన ధీరజ్‌శ్రీకృష్ణ, సత్యప్రసాద్ రాజు, ఎం.పూజితలు భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ధీరజ్‌శ్రీకృష్ణ జూనియర్ సోలో విభాగంలో గోల్డ్, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో సిల్వర్, ట్రెడిషనల్ విభాగంలో సిల్వర్, రిథమిక్ పెయిర్ విభాగంలో బ్రాంజ్, సత్యప్రసాద్‌రాజు 18 ఏళ్ల పైబడిన రిథమిక్ పెయిర్ విభాగంలో గోల్డ్, ట్రెడిషనల్ విభాగంలో సిల్వర్, ఆర్టిస్టిక్ సోలో విభాగంలో సిల్వర్, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా పూజిత 30 ఏళ్లు పైబడిన ట్రెడిషనల్ విభాగంలో నాలుగో స్థానాన్ని సాధించింది. 12 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ ఆసియా క్రీడల్లో సత్తా చాటి విజయవాడ నగరంతో పాటు రాష్ట్ర ఖ్యాతిని చాటిన క్రీడాకారులను కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రవి, ఉపాధ్యక్షులు రామలింగరాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి ఎల్.శాంతి అభినందించారు.



ధీరజ్‌శ్రీకృష్ణ

సాంస్కృతిక కళారంగాల అభివృద్ధికి కృషి



విజయవాడకల్చరల్: జిల్లాలో సాంస్కృతిక కళారంగాల అభివృద్ధికి కృషి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎంఎస్ నారాయణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమించిన ఎంఎస్ నారాయణను నగరానికి చెందిన కళాసంస్థలు గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ నారాయణ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని, కళారంగానికి చెందిన పేద కళాకారులకు ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. సత్కార కార్యక్రమంలో బీవీ వీరభద్రరావు, డేవిడ్ రాజు, చింతకాయల చిట్టిబాబు, ప్రభల శ్రీనివాస్, ఎం.జోషి, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు శ్రీధర్ అన్నారు. అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ వీధిలోని తమ్మన వారి సత్రం వద్ద లక్ష్మీ ఫౌండేషన్, వంశీ ఫార్మ నీలి శ్రీధర్ సౌజన్యంతో పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో కంటి, షుగర్ బీపీ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్యాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి, సభ్యులు దుర్గ శంకర్, తూనిగుంట్ల రాజేంద్రప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతో జాతి నిర్మాణం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులతో అశోక్ తదితరులు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువత జాతి నిర్మాణంలో భాగస్వాములైనప్పుడే అభివృద్ధి సాధ్యమని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకోవాలన్నారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సామాజిక చైతన్యానికి పాటుపడాలన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టూట అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని, స్వామి వివేకానంద ప్రసంగాలతో చైతన్యవంతులై అన్ని రంగాల్లో దూసుకుపోవడమే అందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ అశోక్‌బాబు పేర్కొన్నారు. నేషనల్ యూత్ డే సందర్భంగా రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత తమ కెరీర్‌ను వారే నిర్మించుకోవాలని సూచించారు. యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి మాట్లాడుతూ చికాగో నగరంలో జరిగిన ప్రపంచ సర్వమత ప్రార్థనల్లో పాల్గొని భారతీయతను చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ వీడీఎస్ రామకృష్ణ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సీఈఓ య.శ్రీనివాస్, ఏలూరు సీఈఓ ప్రభాకరరావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

–మానవతావాది, తత్వవేత్త స్వామి వివేకానంద మాట్లాడే ప్రతి మాట యువతలో స్ఫూర్తి నింపేవేనని పలువురు అతిథులు పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజనోత్సవ సందర్భంగా గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం వేడుకలు జరిగాయి. పాఠశాల సహాయకుడు వేదాంతం శ్రీనివాసు, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి బాలగంగాధర్, న్యాయవాది కేజేఎస్ ప్రకాష్ అతిథులు హాజరయ్యారు. తొలుత వారు విద్యార్థులతోపాటు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గసభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రేమతో చూసుకోవాలి



ప్రత్యేక అవసరాల విద్యార్థులతో డాక్టర్ శ్రావణ్, సునీత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రేమతో చూసుకోవాలని డాక్టర్ శ్రావణ్ చెప్పారు. విద్యాధరపురం ఆర్‌కే పబ్లిక్ స్కూల్ రోడ్‌లోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ప్రత్యేక అవసరాల పిల్లలు)లో ఆదివారం సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథి డాక్టర్ శ్రావణ్ తన పుట్టిన రోజుతోపాటు సంక్రాంతి పురస్కరించుకుని సెంటర్‌లోని విద్యార్థులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ సునీతతో కలిసి పిల్లలకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ బుద్ధిమాంద్యమున్న పిల్లల అవసరాలను ఓర్పుతో తెలుసుకుని సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న సెంటర్ నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. సునీత మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సేవలు అందించడానికి సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వివరాలకు 99859 51397 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



బాబా మందిరంలో తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుమంజన సేవ జరిగింది. పెద్ద శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ప్రతిమను కొలువు దీర్చి రమేష్, జ్యోతి దంపతులు మంగళహారతి సమర్పించారు. ఆలయ అర్చకులు గోదా దేవిని పెండ్లి కూతురుగానూ..రంగనాథస్వామివారిని పెండ్లి కుమారునిగానూ చేసి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ గోదారంగనాథ స్వామివార్ల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణోత్సవం తర్వాత వివాహం కాని వధూవరులకు కల్యాణ మాల అందజేస్తామని పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్య శ్రీహరి తెలిపారు.

> **పారాయణం.. పుణ్యప్రదం**
>
> విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం పుణ్యప్రదమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం ధనుర్మాసోత్సవాల్లో ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. సృష్టికి మూలం పరమాత్మ స్వరూపమేనని, అలాంటి పరమాత్మను మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధిగా పూజించాలన్నారు. భక్తులతో కలిసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, కొప్పరపు మారుతి, యల్లాప్రగడ సుదీర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.









ముగిసిన పుస్తక మహోత్సవం

నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. 12 రోజులపాటు పుస్తక ప్రేమికులతో స్టేడియం ప్రాంగణంలో సందడి నెలకొంది. అనేక పుస్తకాలతో కూడిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూఢ నమ్మకాలు వీడాలంటూ ప్రదర్శనలు చేస్తూ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. పిన్న, పెద్ద పుస్తకాలను ఆసక్తి చూసి కొనుగోలు చేసి పాఠకాభిమానాన్ని చూపారు. అనేక పుస్తకాల ఆవిష్కరణలకు వేదికగా మారింది పుస్తక మహోత్సవం. పుస్తకానికి ఆదరణ తగ్గలేదని ఈ మహోత్సవం నిరూపించిందని నిర్వాహకులు అంటున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం పండుగ సెలవు దినం సందర్భంగా నిర్వహించడం లేదని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరవాసులు గమనించాలని ఆయన సూచించారు.